క్లుప్తంగా

ఆకట్టుకుంటున్న చిడుతల రామాయణం



మాట్లాడుతున్న పుట్ట శైలజ

కమాన్‌పూర్: రామగిరి మండలం పన్నూర్ గ్రామంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న చిడుతల రామాయణం ఆకట్టుకుంటోంది. కళలు అంతరించిపోతున్న సందర్భంలో కళాకారులు చిడుతల రామాయణంతో నాటి కళలకు పూర్వవైభవం తీసుకొచ్చారని మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ కొనియాడారు.

డెంగీపై ప్రజలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ పద్మ

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని కల్వచర్ల గ్రామంలో డెంగీ వాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంట పద్మ, ఎంపీటీసీ కొట్టె సందీప్, ఎంఎల్‌హెచ్ ధీరజ, కార్యదర్శి శ్రీనివాస్, ఉపసర్పంచ్ కనుకయ్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ఎలిగేడు: ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు ప్రబలకుంగా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని మండల మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా అన్నారు. ఎలిగేడు మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ధూళికట్టలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో, సుల్తాన్‌పూర్‌లోని ఎంఎల్‌హెచ్‌పీలో జాతీయ డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యుకేటర్ రాజేశ్వరిదేవి, స్టాఫ్‌నర్స్, ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్ పాల్గొన్నారు.

ఓటరు సవరణలపై సమావేశం

జూలపల్లి: రాబోయే సాధారణ ఎన్నికల్లో ఓటరు లిస్టులో పేర్లను సవరించుకునేందుకు అవకాశం కల్పించడంతో మంగళవారం అన్ని రాజకీయ పార్టీల బాధ్యులతో తహసీల్దారు జయశ్రీ సమావేశం నిర్వహించారు. తహసీల్దారు జయశ్రీ మాట్లాడుతూ ఓటరు లిస్టులో సవరణలు, ఇంటి నెంబరు తప్పుగా నమోదు, కొత్త ఓటర్ల నమోదు చేయించుకోవాలని సూచించారు. స్థానిక బీఎల్‌వోల వద్ద ఓటరు లిస్టులు ఉన్నాయని, రాజకీయ పార్టీల బాధ్యులు సరిచూసుకోవాలని చెప్పారు. వైఎస్సార్ టీపీ నాయకుడు కొమ్మ రాజయ్య యాదవ్, కాంగ్రెస్ నుంచి మానుమండ్ల శ్రీనివాస్, బీజేపీ నుంచి రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి దండె వెంకటేశం, డీటీ అబూబకర్, ఆర్‌ఐ సంపత్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న రాజేందర్

మంథని: మంథని నియోజకవర్గంలో రోజురోజుకు బీజేపీ బలపడుతుందని, సమష్టిగా పనిచేస్తే రాబోయే ఎన్నికల్లో ఇక్కడ అధికారం మనదే అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్ అన్నారు. మంగళవారం మంథనిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు కన్నం యుగదీశ్వర్, నాయకులు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, మల్క మోహన, నాంపల్లి రమేష్, చిలువేరు సతీష్, సంపత్ తదితరులు ఉన్నారు.

ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు

ఓదెల: మండలంలోని గోపరపల్లె, కొలనూర్, పొత్కపల్లి గ్రామాల్లోని ఉపాధికూలీలకు ఓదెల ఎంపీడీవో జి.సత్తయ్య మంగళవారం ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యదర్శి ప్రసాద్, ఎంపీవో వాజీద్, ఫీల్డ్ అసిస్టెంట్లు రెడ్డి నవీన్, రాస సత్యనారాయణ పాల్గొన్నారు.

భగీరథ నీటి కోసం ఎదురుచూపులు

- ట్యాంకు నిర్మాణం పూర్తయినా.. సరఫరా కాని వైనం
- సమస్యగా మారిన డిస్ట్రిబ్యూషన్ పైపులైన్ కనెక్షన్
- అధికారుల అనాలోచిత నిర్ణయంపై విమర్శలు



అక్బర్‌నగర్‌లోని ఓవర్‌హెడ్ ట్యాంక్

రామగుండం: ఏడాది క్రితం మిషన్ భగీరథ నీటి ట్యాంకు నిర్మాణం చేపట్టినప్పటికీ పైపులైన్ల బిగింపు విషయమై సమస్య ఉత్పన్నమైంది. దీంతో అంతర్గాం మండల పరిధిలోని అక్బర్‌నగర్ కాలనీవాసులకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయలేని దుస్థితి నెలకొంది. గ్రామీణ తాగునీటి సరఫరాశాఖ నిధులు రూ.16 లక్షలు వెచ్చించి 257 కుటుంబాలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు 60వేల లీటర్ల సామర్థ్యంతో కాలనీకి సమీపంలో ఉన్న గుట్టపైన ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు చెందిన స్థలంలోనే ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించారు. కాగా ట్యాంకు నిర్మించిన తర్వాత అధికారులకు డిస్ట్రిబ్యూషన్ పైపులైన్ల బిగింపుపై సమస్య ఎదురైంది. ఇందుకు ఎన్టీపీసీ, మిషన్ భగీరథశాఖ మధ్య సయోధ్య కుదరకపోవడంతో డిస్ట్రిబ్యూషన్ పైపులైన్ బిగింపు ప్రశ్నార్థకంగా మారింది. ఇంట్రా (ఇంటింటా) పైపులైన్ కనెక్షన్స్ ప్రక్రియ పూర్తయినప్పటికీ ట్యాంకుకు ప్రధానమైన ఇన్‌కమింగ్, ఔట్‌గోయింగ్ డిస్ట్రిబ్యూషన్ పైపులైన్ల నిర్మాణమే మిగిలింది. అయితే అక్బర్‌నగర్ కాలనీవాసులు మిషన్ భగీరథ తాగునీటికి నోచుకోవడం లేదు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్టీపీసీ రెండుశాఖల ఉన్నతాధికారులు సంయుక్తంగా క్షేత్ర పర్యటన చేపట్టి డిస్ట్రిబ్యూషన్ పైపులైన్ల సాంకేతికపరమైన అంశాలపై ఒక అవగాహన కుదుర్చుకోనున్నారు. ప్రత్యామ్నాయంగా రామగుండం మున్సి పల్ పైపులైన్‌కు అనుసంధానించే విషయమై కూడా చర్చలు జరుగుతున్నాయి. త్వరలోనే అక్బర్‌నగర్ కాలనీవాసుల తాగునీటి సమస్య పరిష్కరిస్తాం.

– మురళి, మిషన్ భగీరథ ఏఈ, అంతర్గాం

కొన్ని వీధులకు సరఫరా..



ప్రతి వేసవిలో ఎన్టీపీసీ నుంచి సరఫరా చేసే గోదావరి నీరు కొన్ని వీధులకు మాత్రమే సరఫరా అవుతుంది. అది కూడా కొంత సమయం మాత్రమే. ఏడాదైనా ఇంకా మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో బయట నుంచి మినరల్ వాటర్ కొనాల్సిన దుస్థితి. ఫలితంగా సీజన్‌లో ప్రతి నెలా తాగునీటి కోసం రూ.వెయ్యి ఖర్చు చేయాల్సి వస్తోంది. – కొమ్ము ఐలమ్మ, కాలనీ మహిళ

ఎండాకాలంలో ఇక్కట్లు



అక్బర్‌నగర్‌కు 250మీటర్ల దూరంలోనే ఎన్టీపీసీ బూడిద చెరువు ఉంటుంది. ఫలితంగా అక్బర్‌నగర్‌లో ప్రతి ఇంటిలో ఉన్న బావుల్లో సమృద్ధిగా నీరు ఉన్నప్పటికీ పూర్తిగా కలుషితమైన నీటిపై బూడిద తేలుతూ తాగేందుకు యోగ్యం కాని పరిస్థితి ఉంటుంది. ఎన్టీపీసీ నుంచి వచ్చే పైపులైన్ అన్ని కాలనీలకు లేకపోవడంతో ఎండాకాలం తాగునీటికి ఇక్కట్లే. – మహంకాళి కరుణ, కాలనీ మహిళ

రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్నారు



మాట్లాడుతున్న మక్కాన్‌సింగ్, విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అరాచక పాలన సాగిస్తున్నారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఠాకూర్ మక్కాన్‌సింగ్ ఆరోపించారు. పెద్దపల్లిలో మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు తదితర నేతలతో కలిసి మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో అధికార పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు, జెడ్పీచైర్మన్ తమ పరిధిలో ఉన్న సహజ వనరులైన ఇసుక, మట్టి, బండ, బూడిదను అక్రమంగా అమ్ముకున్నారని, ఆర్ఎఫ్‌సీఎల్ ఉద్యోగాల పేరిట వసూళ్లకు పాల్పడ్డారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు ధీమా వ్యక్తం చేశారు. నాయకులు మల్ల య్య, శ్రీనివాస్, సంపత్, సుభాష్‌రావు, అవినాష్, ర వి, సంతోష్, అభిలాష్, రాజు, మహేశ్ పాల్గొన్నా రు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ క్విజ్ పోటీలు

పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జూన్ 2న రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ కాంపిటీషన్ క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఠాకూర్ మక్కాన్‌సింగ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు విజయరమణారావు తెలిపారు. 16 ఏళ్ల నుంచి 35ఏళ్లలోపు వారంతా పాల్గొనవచ్చన్నారు. పోటీల్లో పాల్గొనే వారు రిజిస్ట్రేషన్ వెబ్‌లింక్‌తో కూడిన ఎస్ఎంఎస్ పొందడానికి సెల్ నెంబరు 76618 99899కు మిస్డ్‌కాల్ ఇవ్వాలన్నారు.

విధులకు గైర్హాజరై ఉద్యోగం పోగొట్టుకోవద్దు



కౌన్సెలింగ్ ఇస్తున్న ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు

కమాన్‌పూర్: సింగరేణి సంస్థలో ఉద్యోగాలు చేస్తున్న వారు విధులకు గైర్హాజరై ఉద్యోగాలను పోగొట్టుకోవద్దని ఏపీఏ జీఎం కె.వెంకటేశ్వర్లు అన్నారు. ఏఎల్‌పీ, 10వ గనుల వద్ద వివిధ కేటగిరిలో విధులు నిర్వహిస్తున్న సుమారు 131 మంది ఉద్యోగులు కొన్ని రోజులుగా విధులకు గైర్హాజరవుతున్నందున ఎస్‌సీవో క్లబ్ గైర్హాజరు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు జీఎం మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, అధికారులు బైద్య, విలాస్ శ్రీనివాస్ పోద్దారు, మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్, లక్ష్మీనారాయణ, హరీశ్, రవిచంద్ర పాల్గొన్నారు.

'మా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి'

పెద్దపల్లిరూరల్: రెవెన్యూ శాఖలో వీఆర్ఏలుగా పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి విన్నవించారు. గతంలో సీఎం హామీ ఇచ్చిన మేరకు పేస్కేలు వెంటనే అమలు చేయాలని జిల్లా వీఆర్ఏ జేఏసీ చైర్మన్ వెంకటేశ్వర్లు, పెద్దపల్లి మండలాధ్యక్షుడు కుమార్ కోరారు.

వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలి

సుల్తానాబాద్: వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలని జేఏసీ జిల్లా చైర్మన్ బండారి వెంకటేశ్వర్లు కోరారు. జిల్లా కేంద్రంలో జేఏసీ పిలుపు మేరకు మంగళవారం పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. జీవో నెంబర్ 39 ప్రకారం ఐదేళ్లు పూర్తయిన వీఆర్ఏలకు వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

✦ నేటి నుంచి గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో 17 నుంచి 23 వరకు ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించాలని ఎంపీవో కిరణ్ సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్ ఆదేశాల మేరకు వర్షాకాలంలో ముందు జాగ్రత్తగా చేపట్టాల్సిన పారిశుధ్య, డ్రైనేజీ శుభ్రం చేయడం, పిచ్చి మొక్కలను తొలగించడం, నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 వరకు పనులు నిర్వహించాలని సూచించారు.

✦ దరఖాస్తుల స్వీకరణ

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్‌లో ఉన్న మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మశ్రీ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ 40 సీట్లు, బైపీసీ 40 సీట్లు, సీఈసీ 40సీట్లు ఉన్నట్లు చెప్పారు. బాలికలకు హాస్టల్ వసతి, బాలురకు బస్సు సౌకర్యం కల్పించినట్లు వివరించారు. 25లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

✦ ధన్యవాద సభకు తరలిన ప్రజా సంఘం నాయకులు

పెద్దపల్లిరూరల్: అంబేడ్కర్ భారీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి సచివాలయానికి అంబేడ్కర్‌గా నామకరణం చేసిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపేందుకు మంగళవారం పెద్దపల్లి నుంచి ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి సురేందర్ సన్నీ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద జరిగిన ధన్యవాద సభలో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. నాయకులు మధు, అంజయ్య, నగేశ్, శ్రీనివాస్, ఇమాన్యుయల్, సతీశ్ ఉన్నారు.

✦ భవన నిర్మాణ పనులకు రూ.5లక్షలు

ధర్మారం: మండల కేంద్రంలోని ఒడ్డెర కులసంఘం భవన నిర్మాణ మిగులు పనులకు రూ.5లక్షలు మంజూరు చేసిన ప్రొసీడింగ్ కాపీని మంత్రి కొప్పుల ఈశ్వర్ సంఘం నాయకులకు అందించారు. కరీంనగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం స్థానిక ఎంపీటీసీ తుమ్మల రాంబాబు ఆధ్వర్యంలో ఒడ్డెర కులసంఘం నాయకులు మంత్రిని కలిసి ప్రొసీడింగ్ కాపీ తీసుకున్నారు. సంఘం అధ్యక్షుడు ముద్దగాండ్ల వెంకటి పాల్గొన్నారు.

✦ రైల్వేలైన్ భూసేకరణ కోసం గ్రామసభ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని చీకురాయి గ్రామ పంచాయతీ పరిధిలో రైల్వేలైన్ కోసం అవసరమైన భూమిని గ్రామ రైతుల నుంచి సేకరించేందుకు మంగళవారం పంచాయతీ ఆఫీసు వద్ద ఆర్డీవో వెంకటమాధవరావు, తహసీల్దార్ వెంకటలక్ష్మి గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ బండారి త్రివేణి, జెడ్పీటీసీ బండారి రామ్మూర్తి పాల్గొన్నారు. రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించారు.

✦ రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు

పెద్దపల్లిరూరల్: సోషల్ మీడియాలో రెచ్చగొట్టేలా పోస్టులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పెద్దపల్లి ఎస్సై మహేందర్ హెచ్చరించారు. సోషల్ మీడియాలో రెండురోజులుగా విమర్శలు చేసుకుంటున్న గ్రూప్ అడ్మిన్లకు మంగళవారం పట్టణంలో కౌన్సెలింగ్ నిర్వహించారు.

✦ 160కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ నర్రాశాలపల్లెలో ఉన్న 25కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 160కేవీ ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలని మాజీ కార్పొరేటర్ వెంగళ పద్మలత విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందించినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో లక్ష్యం సాధించాలి



మెమెంటో అందిస్తున్న కలెక్టర్ సంగీత

కమాన్‌పూర్: ఇంజనీరింగ్ కళాశాలలోని విద్యార్థులు పట్టుదల, కృషితో ఎంచుకున్న లక్ష్యం సాధించాలని కలెక్టర్ సంగీత సత్యనారాయణ అన్నారు. మంథని జేఎన్టీయూ కళాశాలలో మంగళవారం జరిగిన వార్షికోత్సవానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంజనీరింగ్ చేస్తున్న విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్ ఎన్‌వీకె.శ్రీనివాస్, ఆర్జీ–3, ఏఎల్‌పీ జీఎంలు టి.వెంకటేశ్వర్‌రావు, కె.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ చెరువు శ్రీధర్‌రెడ్డి, ఈఈఈ విభాగాధిపతి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కాలనీ ఖాళీ చేయాలి



గ్రామస్తులతో సమావేశమైన ఆర్డీవో, జీఎం

గోదావరిఖని: రామగిరి మండలం చందనాపూర్ గ్రామస్తులతో మంథని ఆర్డీవో వీరబ్రహ్మాచారి మంగళవారం సమావేశమై ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ గురించి వివరించారు. ఆర్జీ–1 జీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ గ్రామంలోని ఎస్సీ కాలనీ ఖాళీ చేయాలని సూచించారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా ఉన్నారన్నారు. ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, ఎస్టేట్ మేనేజర్ బాలసుబ్రహ్మణ్యం, సాంబశివరావు, సర్వే ఆఫీసర్ ప్రభాకర్, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళా సమ్మాన్ సేవింగ్స్ స్కీమ్

యైటింక్లయిన్‌కాలనీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చిన్న మొత్తాల పొదుపు పథకం మహిళా సమ్మాన్ సేవింగ్స్(సర్టిఫికెట్)–2023 మహిళల ఆర్థిక ప్రయోజనం కోసం తపాలాశాఖ ద్వారా అందిస్తున్నట్లు గోదావరిఖని సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. యైటింక్లయిన్ కాలనీ పోస్టాఫీస్‌ను మంగళవారం సందర్శించారు. పోస్టల్ సిబ్బందికి పథకంపై అవగాహన కల్పించారు. ఈ పథకంలో డిపాజిట్ కనిష్ఠంగా రూ.వెయ్యి గరిష్ఠంగా రూ.2లక్షల వరకు పొదుపు చేసుకునే అవకాశం ఉందన్నారు. పూర్తి వివరాల కోసం దగ్గరలో ఉన్న పోస్టాఫీస్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కాలనీ సబ్ పోస్ట్‌మాస్టర్ కొమురయ్య, సిబ్బంది మధు, నర్సింహులు, రామ్ నారాయణ, రాజేశ్, సతీశ్, పోశయ్య పాల్గొన్నారు.

షరతులు లేకుండా ధాన్యం కొనాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న విజయరమణారావు

సుల్తానాబాద్‌రూరల్: ప్రభుత్వం ప్రకటించిన విధంగా తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు డిమాండ్ చేశారు. సుల్తానాబాద్ మండలం రేగడిమద్దికుంటలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి 20రోజులు అవుతున్నప్పటికీ కొనుగోలు చేయడంలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు.ఇంత జరుగుతున్నా.. స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు అంతటి అన్నయ్యగౌడ్, ప్రకాశ్‌రావు, దామోదర్, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాలయ్య, తిరుపతి పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాతో అందుబాటులోకి వైద్యం



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని ప్రజలకు వైద్యసేవలు మరింతగా అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని చందపల్లి, రంగంపల్లిలో మంగళవారం చైర్మన్ మమతారెడ్డితో కలిసి ఎమ్మెల్యే బస్తీదవాఖానాలు ప్రారంభించారు. కమిషనర్ శ్రీనివాసరెడ్డి, డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, కౌన్సిలర్లు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ..

జిల్లా ప్రభుత్వాసుపత్రి వద్ద మంగళవారం జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఎంపీపీ బండారి స్రవంతి, జెడ్పీటీసీ బండారి రామ్మూర్తి, డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో భూసారం పెంపు

పెద్దపల్లిరూరల్: పచ్చిరొట్ట విత్తనాలు వేసి కలియదున్నితే భూసారం పెరుగుతుందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లిలోని డీసీఎంఎస్ గోదాం వద్ద మంగళవారం రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. పెద్దపల్లి సింగిల్‌విండో చైర్మన్ నర్సింహారెడ్డి, ఏడీఏ శ్రీనాథ్, ఏవో అలివేణి, వేణుగోపాల్‌రావు, మల్లారెడ్డి ఉన్నారు.

సీఎం కప్ క్రీడాపోటీలు ప్రారంభం..

పట్టణంలోని ఇండియా మిషన్ సెకండరీ పాఠశాలలో మంగళవారం మండలస్థాయి క్రీడాపోటీలను ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. ఎంపీపీ స్రవంతి, జెడ్పీటీసీ రామ్మూర్తి, ఎంఈవో సురేందర్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కాల్వశ్రీరాంపూర్: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. కాల్వశ్రీరాంపూర్‌లో మంగళవారం ఎమ్మెల్యే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు రాంచంద్రారెడ్డి, పురుషోత్తం, సర్పంచులు శ్రీదేవి, శ్యామ్, శ్రీనివాస్‌రెడ్డి, నాగార్జున్‌రావు, నాయకులు రాజకొమురయ్య, రాజు, నరేశ్, నవీన్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 25మంది లబ్ధిదారులకు మంగళవారం ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. 58 జీవో ద్వారా కాల్వశ్రీరాంపూర్‌లో ఇద్దరికి, పెగడపల్లిలో ముగ్గురికి నివేశనా స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. తహసీల్దార్ అనుపమరావు, ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ రాజకొమురయ్య పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఓదెల: మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు కావటి రాజు, పెద్దపల్లి మార్కెట్ మాజీ డైరెక్టర్ బోడకుంట నరశ్, సర్పంచ్ ఆకుల మహేందర్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రమేశ్ పాల్గొన్నారు.

ధాన్యం ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి



బోల్తాపడిన ట్రాక్టర్



సతీశ్ మృతదేహం

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని చిన్నబొంకూర్ గ్రామంలో మంగళవారం ఊర చెరువు కట్ట ఎక్కుతున్న క్రమంలో ధాన్యం లోడ్ ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడగా డ్రైవర్ వరికిల్ల సతీశ్(37) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మచ్చ శ్రీనివాస్ వరి పంట కోసి ధాన్యంను ట్రాక్టర్‌లో తరలిస్తున్న క్రమంలో చెరువు కట్టపైకి ఎక్కిస్తుండగా ప్రమాదవశాత్తు వాహనం బోల్తాపడింది. డ్రైవర్ సతీశ్‌పై ట్రాక్టర్ పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాద సమయంలో ట్రాక్టర్‌పై అర్నకొంట తిరుమలేశ్, మచ్చ ఆదర్శ్ ఉండగా తిరుమలేశ్‌కు గాయాలు కావడంతో సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలానికి ఎస్‌ఐ విజేందర్‌తో పాటు ఎస్‌ఐలు అశోక్‌రెడ్డి, వినీత చేరుకొని వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇళ్ల స్థలాలు, ఇళ్లు సాధించేదాకా పోరాటం



మాట్లాడుతున్న నగునూరి శేఖర్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరయ్యేదాకా పోరాటం చేద్దామని టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు నగునూరి శేఖర్ అన్నారు. పెద్దపల్లిలో మంగళవారం జిల్లాశాఖ కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు బుర్ర సంపత్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శేఖర్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై అనేక పోరాటాలు చేసి సాధించుకున్నామని, ఈ విషయంలో రాజీలేని పోరాటం చేద్దామని కోరారు. సమస్యల సాధన కోసం జూన్ 2న ఆమరణ దీక్షకు సంపత్‌కుమార్ సిద్ధపడగా దశలవారీగా పోరాటం చేయాలని, అయినా పరిష్కారం కాకుంటే మలివిడత పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నాయకులు వంశీ, టీకే శ్రీనివాస్, రాజేశం, అశోక్, విజయ్‌కుమార్, నర్సయ్య, భాస్కర్, బాలసాని రాజయ్య, శ్రీధర్, మూర్తి, శ్యామ్, రవీందర్, విద్యాసాగర్, గొర్రె తిరుపతి పాల్గొన్నారు.

క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలి



పరిచయం చేసుకుంటున్న కమిషనర్ చిన్నారావు

జ్యోతినగర్: క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్ చిన్నారావు అన్నారు. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని ప్రభుత్వ జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో మంగళవారం సీఎం కప్ క్రీడలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కమిషనర్ హాజరై జెండా ఊపి క్రీడలను ప్రారంభించారు. సూపరింటెండెంట్ నారాయణరావు, మనోహర్, శ్రీనివాస్, శ్యామ్, శానిటరీ సూపర్‌వైజర్ సంపత్, క్రీడల నోడల్ అధికారి, పీఈటీ శ్రీనివాస్, రమ్య పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను వెలికితీసేందుకే..

సుల్తానాబాద్: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను వెలికితీసేందుకే సీఎం కేసీఆర్ కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ బాలాజీరావు అన్నారు. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం రెండోరోజు వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. జెడ్పీటీసీ మినుపాల స్వరూప, మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ బుర్ర శ్రీనివాస్‌గౌడ్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ఎం.రవీందర్, ఎంపీడీవో శశికళ, ఎంపీవో ఫయాజ్ అలీ, తహసీల్దార్ యాకన్న, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఫకీర్ యాదవ్, పీఈటీ రమేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రేంచందర్‌రావు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీల విజేత బామ్లానాయక్‌తండా

పాలకుర్తి: బసంత్‌నగర్ వర్కర్స్ క్లబ్ ఆవరణలో రెండు రోజులుగా కొనసాగుతున్న సీఎం కప్ మండల స్థాయి ఆటల పోటీల్లో మండలంలోని బామ్లానాయక్‌తండా గ్రామ జట్టు ప్రథమ స్థానంలో నిలిచాయి. వాలీబాల్, ఫుట్‌బాల్, కబడ్డీ, రన్నింగ్ పోటీల్లో గ్రామానికి చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. గెలుపొందిన వారిని సర్పంచ్ బదావత్ రాజునాయక్ అభినందించారు. ఎంపీడీవో లలిత, పీఈటీలు శోభారాణి, కవిత, రాజేశ్వరి, శ్రీనివాస్, సంతోష్, రేణుక పాల్గొన్నారు.

లారీ ఢీకొని మహిళకు గాయాలు

గోదావరిఖని: స్థానిక మున్సిపల్ ఆఫీస్ సమీపంలో మంగళవారం హైవేరోడ్డు చౌరస్తా వద్ద లారీ, ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో వహీదా అనే మహిళకు గాయాలయ్యాయి. సిగ్నల్ నియంత్రణ లేకపోవడంతో గోదావరిఖని బస్టాండ్ నుంచి వేగంగా వస్తున్న లారీ రోడ్ క్రాస్ చేస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో వెనకాల కూర్చున్న వహీదాకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.